## క్లుప్తంగా

### నేడు గంగమ్మ విగ్రహ ప్రతిష్ట

**వీరబల్లి :** మండలంలోని తాటికుంటపల్లి పంచాయతీ షికారుపాలెంలో ఇటీవల నూతనంగా నిర్మించిన గంగమ్మ దేవాలయంలో నేడు బుధవారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి హాజరుకానున్నారన్నారు. భక్తులు ప్రతిష్ట పూజల్లో పాల్గొనాలని వారు కోరారు.

### సిమెంట్ గోడౌన్ పరిశీలన



గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఈఈ మురళీకృష్ణ

**పెనగలూరు :** మండల కేంద్రంలో ఉన్న సిమెంట్ గోడౌన్‌ను హౌసింగ్ ఈఈ మురళీకృష్ణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆన్‌లైన్ ప్రకారం ఎన్ని సిమెంటు బస్తాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు, మిగిలి ఉన్న సిమెంట్ బస్తాలు ఎన్ని అన్న అంశంపై వారు రికార్డులను చూసి పరిశీలించారు. 2024 వరకు పక్కా గృహాలు మంజూరై పూర్తి చేసుకున్న వారికి సిమెంటు, స్టీల్ పంపిణీ చేస్తున్నామని వారు తెలియజేశారు. బీసీ, ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు అదనంగా ఇస్తున్నామన్నారు. పెండింగ్ లేకుండా ఇల్లు పూర్తి చేసుకున్న వారికి వెంటనే బిల్లులు అకౌంట్లలో జమ చేస్తున్నామని చెప్పారు. పక్కా గృహాలు మంజూరై అర్ధాంతరంగా ఆగిపోయిన వారు వెంటనే పక్కా గృహాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత



నాగవరంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

**చిట్వేలి :** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నాగవరం పంచాయతీలోని వడ్డిపల్లి, దేవుని నాగవరం, ఉప్పరపల్లి, చొప్పావారిపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించారు. అలానే మార్గోపల్లి గ్రామ పంచాయతీ కేంద్రంలో నిర్మించిన ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రాలను ప్రారంభించి అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ముక్కా సాయివికాస్ రెడ్డి, కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

### రైతు సేవా కేంద్రాలు ఆకస్మిక తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగరాజు

**సిద్దవటం :** మండలంలోని బొగ్గిడివారిపల్లె, ఉప్పరపల్లె రైతు సేవా కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్టు బద్వేల్ ఏడీఏ నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను తనిఖీ చేశారు. క్షేత్ర పర్యటన చేసి రైతుల సందేహాలను నివృత్తి చేశామన్నారు. అనంతరం ఆయన సిబ్బందితో శాఖపరమైన కార్యక్రమాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. పసుపు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలానే రైతులు సాగు చేస్తున్న జనుము పంటను పరిశీలించి భూసారాభివృద్ధికి జనుము చేసే మేలును వివరించినట్టు తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు వెంకటేష్, దేవదాసు, వెంకటసుబ్బారెడ్డి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సందీప్‌సింహ యాదవ్, ఝాన్సీ, ప్రేమ్‌సందీప్ పాల్గొన్నారు.

### పురపాలిక కార్మికుల సంతకాల సేకరణ



సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్న కార్మికులు

**రాజంపేట :** రాజంపేట మున్సిపాలిటీలో పని చేసే కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరిని పర్మినెట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 10న మాకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి సేకరించిన సంతకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి, నాయకులు బాలాజీ, సాలమ్మ, ప్రమీల, రమణ పాల్గొన్నారు.

### గోపుర కలశాలు వితరణ

**పెద్దమండ్యం :** పాపేపల్లెలోని కుషావతి నది ఒడ్డున ఏకశిలగుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన గోపురానికి పెద్దమండ్యంకు చెందిన నార రామచంద్రయ్య, రామక్రిష్ణ, శ్రీనివాసులు కుటుంబ సభ్యులు రూ.1 లక్ష విలువ చేసే కలశాలను ఆలయ అర్చకులకు అందజేశారు.

# ప్రణాళికబద్ధమైన అభివృద్ధికే స్థలాల క్రమబద్ధీకరణ



రాజంపేట: మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ వైకోమ్ నైదియాదేవి

**రాజంపేట :** నిరభ్యంతకరమైన ప్రభుత్వ భూమిపై నివాస యూనిట్ల ద్వారా అనధికార ఆక్రమణను క్రమబద్ధీకరించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని రాజంపేట సబ్‌కలెక్టర్ వైకోమ్ నైదియాదేవి అన్నారు. మంగళవారం తన చాంబరులో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ యేడాది జనవరి 29న జీఓ నెం.30 జారీ చేసిందన్నారు. క్రమబద్ధీకరించడంలో ప్రభుత్వం ఉద్దేశం ప్రకారం తొలిగింపు ముప్పు, అరక్షితస్థితిలో ఉండటం, అటువంటి ఆక్రమణలకు సంబంధించి ఎటువంటి అధికారిక పత్రాలు లేకపోవడం వంటివి, ప్రజల ఇబ్బందులను తొలిగించడం, అటువంటి ప్రాంతాల్లో స్థానిక సంస్థల ప్రణాళికబద్ధమైన అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు నివాస యూనిట్ల ద్వారా ఆక్రమణలు క్రమబద్ధీకరించడానికి ఈయేడాది డిసెంబరు 31 నాటికి ఈ పథకం ముగుస్తుందన్నారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో నివాస యూనిట్ల ద్వారా అనుమతి లేని ఆక్రమణలు 2019 అక్టోబరు 15 నాటికి, లేదా అంతకుముందే జరిగి వుండాలన్నారు. కుటుంబంలోని మహిళా సభ్యులు మాత్రమే క్రమబద్ధీకరణకు అర్హులన్నారు. అర్హులైనవారు ఈ పథకాన్ని పొందాలంటే సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సబ్‌కలెక్టర్ చెప్పారు.

**దరఖాస్తులు చేసుకోవాలి**

**రాయచోటి టౌన్ :** రాయచోటి రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా నిర్మించుకున్న (15.10.2019) నిర్మించుకున్న గృహాలను క్రమబద్ధీకరించుకోవాలని రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ స్థలంలో నివసిస్తున్న గృహాలకు క్రమబద్ధీకరించుటకు జీవోఎంఎస్ 30. 29.01.2015 ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ ఉత్తర్వుల మేరకు 150 చదరపు గజాల్లో ఉన్న పక్కా గృహాలు, అంతకు మించి ఉన్న పక్కా గృహాలకు ప్రభుత్వ వారు నిర్దేశించిన మార్కెట్ వాల్యూ ప్రకారం క్రమబద్ధీకరించబడుతుందన్నారు. కాబట్టి అలాంటి అభ్యర్థులు దరఖాస్తుల వారి పరిధిలోని సచివాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

**అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ**

**గాలివీడు/లక్కిరెడ్డిపల్లె/సంబేపల్లె/రామాపురం :** గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరిస్తున్నట్లు తహసీల్దార్‌లు భాగ్యలత, శ్రీనివాసులు, సుబ్రమణ్యం రెడ్డి, రామాంజనేయులు తెలిపారు. జీఓ నంబర్ 30 ను అనుసరించి ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీం 2025 ప్రకారం క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరుపైనే జారీ చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 అక్టోబరు 15ను కటాఫ్ డేట్‌గా తీసుకుని ఆ తేదీ కంటే ముందు ఆక్రమించిన వారికే నిబంధనలు అనుసరించి భూముల్ని క్రమబద్ధీకరిస్తామన్నారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమద్దీకరణ చేస్తామని, కాకపోతే లబ్ధిదారుల కుటుంబసభ్యులు ఐటీ చెల్లింపుదారులై ఉండకూడదని, కుటుంబంలో ఎవరి పేరుపైన భూములు వుండకూడదన్నారు. అలాగే నాలుగు చక్రాలు వాహనం ఉంటే అనర్హులన్నారు. అయితే వ్యవసాయ పనులకు ఉపయోగించే ట్రాక్టర్లు, టాక్సీ, ఆటోలకు మాత్రం మినహాయింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 151-300, 301-450, 451 గజాలకు పైన ఇంటి నిర్మాణాన్ని బట్టి.. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు, ఎగువున ఉన్నవారి రిజిస్ట్రేషన్ బేసిక్ విలువలో, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఖాళీ స్థలాలు, వాటిలో తాత్కాలిక ఇళ్లు కట్టుకున్నా క్రమబద్ధీకరణకు అనర్హులని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకు రూ.10వేలు, పట్టణాల్లో నెలకు రూ.14వేలు ఆదాయం ఉన్నవారు దీనికి అర్హులన్నారు. నెలకు రూ.300లోగా విద్యుత్ ఛార్జీల చెల్లింపు ఉండాలని, మెట్ట, మాగాణి కింద కలిపి 10 ఎకరాలకు మించకూడదన్నారు. ఆర్‌సీసీ రూఫ్/ఆస్‌బెస్టాస్ రూఫ్‌ను ఇటుక గోడలతో నిర్మించి ఉండాలన్నారు. క్రమబద్ధీకరణకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్, ఆస్తిపన్ను చెల్లింపు, విద్యుత్తు బిల్లు, వాటర్ బిల్లులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

# ఉపాధి పనులు కల్పించండి



ఉపాధి హామీ ఏపీఓకు వినతి పత్రం అందిస్తున్న హరిజనవాడ ప్రజలు

**గాలివీడు :** ఉపాధి పనులకు వెళ్లేందుకు జాబ్ కార్డులు కల్పించండి మహాప్రభో అంటూ గోపనపల్లె గ్రామం బండకింద హరిజనవాడ ప్రజలు ఏపీఓ హరిప్రసాద్‌కు విన్నవించుకున్నారు. ఇంతకు మునుపే పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో మంగళవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఏపీఓను కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయాన్ని అనేకమార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ స్పందించకపోవడంతో కూలీనాలీ చేసుకుని జీవనం సాగిస్తున్నామని వాపోయారు. గ్రామాల్లో ప్రతీ కూలీలకు 150 రోజులకు తగ్గకుండా పని కల్పించేలా ఉపాధి జాబ్ కార్డులు మంజూరు చేస్తామని ప్రభుత్వం చెబుతుంటే క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా అధికారుల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం అర్హులైన కూలీలకు అన్యాయం జరుగుతోంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తమకు జాబ్ కార్డులు మంజూరు చేయించి ఉపాధి హామీ పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సామాజిక నైపుణ్యాలను మెరుగుపరచాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

**నందలూరు :** ఆటిజం ఉన్న పిల్లల్లో సామాజిక నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సైక్రియాటిస్టులు డాక్టర్ ఉదయ్ కిరణ్, రాధికలు పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ వైద్యులు శరత్ కమల్, కార్తిక్ విశ్వనాథ్‌ల ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సైకియాట్రిస్టులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెల 2వ తేదీన ఆటిజం డేగా పరిగణిస్తారన్నారు. ఏప్రిల్ నెల మొత్తం ఆటిజం అవగాహన నెలగా పాటిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రజలకు ఆటిజం లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీల్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్



ఈఈ రాజశేఖరరెడ్డి

**రాజంపేట రూరల్ :** విద్యుత్ వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 10వ తేదీ ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు డివిజనల్ విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రాజశేఖరరెడ్డి తెలియజేశారు. స్థానిక డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో మంగళవారం ఈఈ రాజశేఖరరెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఆదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ వీ.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు ఎస్ ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మిలు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరు, పుల్లంపేట, చిట్వేలీ, ఓబులవారిపల్లి, పెనగలూరు మండలాలలోని విద్యుత్ వినియోగదారులు పాల్గొని వారి సమస్యలు తెలియజేయాలని కోరారు. ఈ ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం



వీరబల్లి/రాజంపేట రూరల్: ఎమ్మెల్యే ఆకేపాటికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

**రాజంపేట టౌన్ :** విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం కాగలదని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని శ్రీ శారద విద్యానికేతన్ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన ఆ స్కూల్ 30వ వార్షికోత్సవ వేడుకకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని అందువల్ల విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. చిన్న తరగతుల నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు ఇవ్వకపోయినా ఫర్వాలేదని, ఎంత కష్టమైనా ఉన్నత విద్యావంతులను చేయాలని సూచించారు. శ్రీ శారద విద్యానికేతన్ హైస్కూల్ గత ముప్పై సంవత్సరాలుగా విద్యార్థులకు తమవంతు సేవలు అందిస్తుండటం ఎంతైనా అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులతో మమేకమై ఈ ప్రయాణాన్ని ఇలాగే కొనసాగించాలని ఆకేపాటి ఆకాంక్షించారు. కాగా వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 సుబ్బరాయుడు, కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా రమణారెడ్డి, డాక్టర్ జవ్వాజి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి**



రాజంపేట టౌన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి

**వీరబల్లి/రాజంపేట రూరల్ :** మండలంలోని సీతంపేట వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరాజు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వాణిజ్య విభాగం మండల అధ్యక్షులుగా వెంకటరాజు నియమించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిని కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ శాలువా పూలదండలతో సన్మానించారు. వెంకటరాజు మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. పదవి వచ్చేలా సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో షికారుపాలెం మలుగూరు నాయక్, సీతంపేట వైఎస్సార్‌సీపీ నాయకులు చాంద్ బాషా, లాయర్ బాబు, వెంకటేష్, యాసిన్, మౌలా తదితరులు పాల్గొన్నారు.

# దారి సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తాం



పల్లంపాడులో వివాదాస్పద దారిని పరిశీలిస్తున్న తహసీల్దార్ అమరేశ్వరీ, ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డిలు

**పెనగలూరు :** మండలంలోని ఎస్ఆర్ పురం పంచాయతీ పల్లంపాడు గ్రామం వద్ద వివాదాస్పద స్థలాన్ని మంగళవారం సాయంత్రం తహసీల్దార్ అమరేశ్వరీ, ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డిలు పరిశీలించారు. గ్రామంలో దారి విషయమై గత మూడు సంవత్సరాల నుంచి రెండు వర్గాల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. దీంతో సమస్య ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి దారి విషయాలు ఘర్షణలు జరిగే అవకాశం ఉన్నందున సామరస్యంగా ఈ సమస్యను పరిష్కరిస్తామని రెండు వర్గాలు వారికి అధికారులు చెప్పారు. బుధవారం మండల కేంద్రానికి వస్తే ఇరువర్గాల సమక్షంలో దారిని పరిశీలించడం జరుగుతందని, ఇరువర్గాలకు నచ్చజెప్పారు. గత మూడు సంవత్సరాలుగా తెగని దారి సమస్య ఇప్పుడు పరిష్కరిస్తామని అధికారులు గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు రామయ్యను దర్శించుకోనున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

**ఒంటిమిట్ట :** ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన మూల విరాట్‌ను నేడు(బుధవారం) కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి దర్శించుకోనున్నట్టు రాజంపేట ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించనున్నట్టు పేర్కొన్నారు.

# వారంలో అందుబాటులోకి అతిథి గృహాలు

**బి.కొత్తకోట :** హార్సిలీహిల్స్‌పై చేపట్టిన అతిథి గృహాల పనులు పూర్తయ్యాయని, వారంలో సందర్శకులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని పర్యాటకశాఖ తిరుపతి డీవీఎం సీహెచ్.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన కొండపై మేనేజర్ నేదురుమల్లి సాల్విన్‌రెడ్డి, డీఈఈ శ్రీనివాస్‌తో కలసి పూర్తయిన ఆధునీకికరణ పనులను పరిశీలించారు. రూ.10 కోట్లతో చేపట్టిన పనుల్లో ప్రస్తుతానికి 12 అతిథి గృహాల పనులు పూర్తి చేయించామని చెప్పారు. వీటిని పరిశీలించిన ఆయన ఇంకా మిగిలిన పనులను గుర్తించి వాటిని ఒకట్రెండు రోజుల్లో పూర్తి చేసి తక్షణమే పర్యాటకశాఖకు అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. తర్వాత కాన్ఫరెన్స్ హాలును పరిశీలించారు. ఇప్పటికే మంజూరైన నిధుల్లో కాంట్రాక్టర్ చేపట్టాల్సిన మిగిలిన పనులను సమీక్షించారు. అనంతరం మేనేజర్ సాల్విన్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల తర్వాత 12 అతిథి గృహాలను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. విండ్‌ఫాల్, యాత్రి నివాస్ అతిథి గృహాలను స్టార్ హోటల్ తరహాలో అన్ని సౌకర్యాలతో ఆధునీకికరించడం జరిగిందన్నారు. పర్యాటకులు టూరిజం సేవలు పొందాలని కోరారు.

### అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి మండిపల్లి



మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ గేటును ఆవిష్కరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

**సంబేపల్లె :** మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం సంబేపల్లె సమీపంలో ఏర్పాటు చేసిన నీటి బోరును, మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలకు నాగిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేటును మండిపల్లి ప్రారంభించారు. అనంతరం నారాయణరెడ్డిపల్లె గ్రామంలోని కొండావాండ్లపల్లె క్రాస్ సమీపంలో ఉన్న బోరుమోటర్‌ను నాయకులతో కలసి ప్రారంభించారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయండి

**రాయచోటి అర్బన్ :** క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి నేతలు, కార్యకర్తలంతా కృషి చేయాలని అన్నమయ్య డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన డీసీసీ కార్యవర్గ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2029 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతి గ్యాస్ సిలిండర్‌పై ధరను రూ.50లు పెంచడాన్ని తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలంటూ కోరారు. దేశంలో ఉన్న ఏకైక సెక్యులర్‌పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. కార్యక్రమంలో డీసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్, సింగం రామక్రిష్టారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు నిగర్ సుల్తానా, తొట్టి వెంకటరమణారెడ్డి, ఖాదర్ ఖాన్, మన్సూర్ అలీఖాన్, బాబా సర్దార్, వనజా రెడ్డితోపాటు నూతనంగా ఎంపికైన కాంగ్రెస్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న మహాభారత నాటక ప్రదర్శన



మహాభారతాన్ని హరికథ రూపంలో వివరిస్తున్న కౌసల్య భాగవతారాణి

**గాలివీడు :** మండలంలోని ఆరవీడు గ్రామం పాత పాలెంలోమహాభారతంపై తిరుపతి వాస్తవ్యులు కౌసల్య భాగవతారణి పీలేరు వారి ఆధ్వర్యంలో హరికథ, నాటకం ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ 7న ప్రారంభమైన నాటకం 18 రోజుల పాటు పగలు హరికథ, రాత్రి నాటకం ప్రదర్శనలతో 24వ తేదీకి సంపూర్ణం అవుతుందన్నారు. వైభవంగా కళ్లకు కట్టినట్లు మహాభారతం నాటకం జరుగుతుండటంతో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# బ్రహ్మాండం.. బ్రహ్మోత్సవం



కోలాట ప్రదర్శనలో మహిళల బృందం

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వార్షిక శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ రోజు సింహ వాహనంపై సీతాపతి రాజసం ఉట్టిపడేలా ఊరేగాడు. ఊరేగింపులో పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో అలరించాయి. కేరళ వాయిద్యాలు, కోలాటాలు, కూచిపూడి నాట్యం భక్తులకు కనువిందు చేశాయి. ఉత్సవాల్లో హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి దేవ్ కుచిపూడి కళాబృందం నాట్య విన్యాసాలు చేశారు. కుచిపూడి నృత్య అకాడమీ స్థాపకురాలు బసవ లావణ్య కళాబృందం తమ కూచిపూడి నాట్యంతో భక్తులను అలరించారు. ప్రదర్శనలో సుష్మా, వైష్ణవి, ద్వారక, పూజిత, భవిత, త్రివేణి, లాస్యప్రియ, శ్రద్ధ, శ్రావణి, సహస్రలు పాల్గొన్నారు.
– ఒంటిమిట్ట



కూచిపూడి నాట్య భంగిమలో కళాకారుల బృందం



విద్యుద్దీపాలంకరణలో ఒంటిమిట్ట రామాలయం



భక్తులను ఉర్రూతలూగించిన కేరళ వాయిద్యాలు



కోలాట ప్రదర్శనలో అలరిస్తున్న శ్రీవారి భక్త బృందం



ఆకట్టుకున్న వేషధారణ

# వైభవంగా రాములోరి ఉత్సవాలు



రాజంపేట టౌన్: పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్న సీతారాములు



నందలూరు: సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

**రాజంపేట టౌన్/నందలూరు/పుల్లంపేట:** శ్రీరామ నవమి ఉత్సవాలు పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అనేక ప్రాంతాల్లో సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అలాగే పలు ప్రాంతాల్లో సీతారాముల ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగిస్తూ భక్తిని చాటుకుంటున్నారు. నవమి ఉత్సవాల సందర్భంగా రామాలయాల వద్దకు చేరి ప్రత్యేక పూజలు, భజనల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనడం కనిపిస్తోంది. ఈ సందర్భంగా ప్రజలు కులమతాలకు అతీతంగా, పేద, మధ్య తరగతి అన్న తేడా లేకుండా సహపంక్తి భోజనం ఆయా ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. నవమి ఉత్సవాలు ప్రజల మధ్య ఆత్మీయతను పెంచుతున్నాయి. అన్ని ప్రాంతాల్లో ప్రజలు నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుండటంతో సందడి వాతావరణం నెలకొంది. నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన కోదండ రామస్వామి దేవస్థానంలో సీతారాముల వారి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అలానే పుల్లంపేట మండలంలో ఉత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు.



రాజంపేట టౌన్: ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు



పుల్లంపేట: అనంతంపల్లిలో విద్యుత్ వెలుగుల్లో రామాలయం